భారత 15వ అటార్నీ జనరల్‌గా సీనియర్ న్యాయవాది కొట్టాయన్ కటాన్ కోట్ వేణుగోపాల్ (కె.కె.వేణుగోపాల్) 2017జులై 3 న బాధ్యతలు స్వీకరించారు. ముకుల్ రోహత్గీ స్థానంలో వేణుగోపాల్ నియమితులయ్యారు. 1960 నుంచి న్యాయవాద వృత్తిలో ఉన్న వేణుగోపాల్ మొరార్జీ దేశాయ్ ప్రధానిగా ఉన్న సమయంలో అదనపు సొలిసిటర్ జనరల్‌గా పని చేశారు. 2జీ స్పెక్ట్రం కుంభకోణం కేసులో అమికస్ క్యూరీగా వ్యవహరించారు. బాబ్రీ విధ్వంస కేసులో భాజపా అగ్రనేత ఎల్‌కే అడ్వాణీ తరపున వాదనలు వినిపించారు. వేణుగోపాల్ వయసు 86 సంవత్సరాలు. పద్మభూషణ్, పద్మ విభూషణ్ పురస్కారాలు గెలుచుకున్నారు.

ఫేస్‌బుక్ వినియోగంలో భారత్ స్థానం..?

1. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార భద్రత కల్పించడం కోసం 'అన్న అమృత హస్తం' పథకాన్ని రాష్ట్రంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏ రోజు నుంచి విస్తరించింది? (రాష్ట్రంలోని 104 ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో అన్న అమృతహస్తం పథకం ఇప్పటికే అమలవుతోంది. గర్భిణులు, బాలింతలకు రాష్ట్రంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం ఒక పూట భోజనాన్ని అందిస్తుంది. నెలలో 25 రోజులు అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్నం, ఆకుకూర పప్పు/ కూరగాయలతో సాంబారు, ఉడికించిన గుడ్డు/ గుడ్డు కూర, 200 మి.లీ. పాలు అందిస్తారు.)

ఎ) 2017 ఏప్రిల్ 1 బి) 2017 మే 1
సి) 2017 జూన్ 1 డి) 2017 జులై 1

2. 2017 సంవత్సరానికి ప్రతిష్టాత్మక 'గ్రేట్ ఇమ్మిగ్రెంట్స్' అవార్డు పొందిన భారతీయ అమెరికన్ ఎవరు? (సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక రంగాల్లో అమెరికా ముందంజ వేయడానికి చేసిన సేవకు గుర్తింపుగా అమెరికా స్వాతంత్ర దినం సందర్భంగా ఏటా జులై 4 న ఈ అవార్డును ప్రదానం చేస్తారు.)

ఎ) శంతను నారాయణ్ బి) వివేక్ మూర్తి
సి) సెంథిల్ రామ్మూర్తి డి) ఎ, బి

3. 2017 జులైలో చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్ హాంకాంగ్‌లో పర్యటించారు. జిన్‌పింగ్ 2013 లో అధికారం చేపట్టిన అనంతరం హాంకాంగ్‌లో పర్యటించడం ఇది ఎన్నోసారి? (హాంకాంగ్ చైనా ఆధీనంలోకి వచ్చి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జిన్‌పింగ్ అక్కడ పర్యటించారు. 1997 లో బ్రిటన్ హాంకాంగ్‌ను చైనాకి అప్పగించిన సమయంలో 'ఒక దేశం-రెండు వ్యవస్థలు' అనే విధానాన్ని అనుసరించాలని నిర్ణయించారు.

ఎ) తొలిసారి బి) రెండోసారి
సి) మూడోసారి డి) నాలుగోసారి

4. 2017 జులైలో ఏ దేశం ప్రయోగించిన రాకెట్ 'లాంగ్ మార్చ్ - 5 యై 2' విఫలమైంది? (దక్షిణ హైనాన్ ప్రావిన్స్‌లోని వెన్‌చాంగ్ అంతరిక్ష ప్రయోగ వేదిక నుంచి దీన్ని ప్రయోగించారు. షిజియాన్ - 18 ఉపగ్రహాన్ని ఈ రాకెట్ కక్ష్యలోకి ప్రవేశ పెట్టలేకపోయింది. భారీ బరువులను మోసుకెళ్లేందుకు సిద్ధం చేసిన లాంగ్ మార్చ్ - 5 ను 2016 నవంబరులో తొలిసారి విజయవంతంగా ప్రయోగించారు.)

ఎ) అమెరికా బి) చైనా
సి) ఉత్తర కొరియా డి) దక్షిణ కొరియా

5. తీవ్రమైన గుండె లోపాలు ఉన్న 26 వారాల పిండాన్ని తొలగించుకునేందుకు ఒక మహిళకు 2017 జులైలో అనుమతి ఇచ్చిన సుప్రీంకోర్టు ధర్మాసనంలోని న్యాయమూర్తులను గుర్తించండి. (1971 లో 20 వారాలు పైబడిన పిండం తొలగింపును నిషేధించే గర్భస్రావ చట్టాన్ని ప్రభుత్వం రూపొందించింది)

ఎ) జస్టిస్ జాస్తి చలమేశ్వర్, జస్టిస్ రంజన్ గొగోయ్
బి) జస్టిస్ మదన్ లోకూర్, జస్టిస్ కురియన్ జోసెఫ్
సి) జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఎం.ఎం. ఖాన్ విల్కర్
డి) జస్టిస్ ప్రఫుల్ల చంద్రపంత్, జస్టిస్ అభయ్ మనోహర్ సాప్రే

6. భారత సంతతికి చెందిన సీనియర్ దౌత్య అధికారి, తెలుగు తెలిసిన వ్యక్తి కృష్ణ ఆర్.అర్స్‌ను ఏ దేశానికి అమెరికా కొత్త రాయబారిగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నియమించారు?

ఎ) చిలీ బి) అర్జెంటీనా
సి) సురినామ్ డి) పెరూ

7. 2017 జూన్ 30 న ఏ దేశ పార్లమెంట్ స్వలింగ వివాహాలను చట్టబద్ధం చేసింది? (ఈ ఏడాది ఆఖరు నుంచి అమలయ్యే అవకాశం ఉన్న దీని ద్వారా 2001 నుంచి ఆ దేశంలో ఉంటున్న వారెవరైనా జంటగా మారితే పిల్లల దత్తత సహా అన్ని రకాల వైవాహిక హక్కులను పొందుతారు.)

ఎ) ఇటలీ బి) ఆస్ట్రియా సి) జర్మనీ డి) ఫ్రాన్స్

8. 2017 జులైలో ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి 'హ్వాసాంగ్ - 14'ను ఏ దేశం విజయవంతంగా పరీక్షించింది?

ఎ) ఇజ్రాయెల్ బి) ఉత్తర కొరియా
సి) పాలస్తీనా డి) దక్షిణ కొరియా

9. 'మిసెస్ ఇండియా - 2017' టైటిల్ గెలుచుకున్న హైదరాబాద్‌కు చెందిన మహిళ ఎవరు? (ఈ పోటీలను చెన్నైలో నిర్వహించారు. ఈమె కుటుంబం 50 ఏళ్ల కిందటే ఉత్తర ప్రదేశ్ నుంచి హైదరాబాద్‌కు వచ్చి స్థిరపడింది.)

ఎ) మమతా త్రివేది బి) దీపాలీ ఫడ్నిస్
సి) నమితా బాజ్‌పాయి డి) సుచీదత్

10. ప్రపంచంలోనే తొలిసారిగా బ్యాటరీ అవసరం లేని సెల్‌ఫోన్‌ను ఇటీవల ఏ దేశ శాస్త్రవేత్తలు తయారు చేశారు? (ఇది పరిసరాల్లోని రేడియో సంకేతాలు లేదా కాంతి నుంచి శక్తిని ఒడిసిపట్టడం ద్వారా పని చేస్తుంది. ఈ పరిశోధకుల బృందంలో భారత సంతతికి చెందిన శ్యామ్ గొల్లకోట, వంశీ తాళ్ల కూడా ఉన్నారు.)

ఎ) సింగపూర్ బి) అమెరికా
సి) ఆస్ట్రేలియా డి) బ్రిటన్

11. బచావత్ ట్రైబ్యునల్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన 811 టీఎంసీల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వరుసగా ఎన్ని టీఎంసీల చొప్పున వినియోగించుకోవాలని 2017 జులైలో కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది? (గత రెండేళ్ల లాగానే ఈ ఏడాది కూడా కృష్ణా బేసిన్‌లో నీటి వినియోగం ఉంటుందని తెలుగు రాష్ట్రాలకు కేంద్రం తెలియజేసింది. 811 టీఎంసీలకు మించి వచ్చినా, తగ్గినా ఇదే నిష్పత్తిలో వాడుకోవాలి. రెండు రాష్ట్రాలు తమకు కేటాయించిన నీటిని ఎక్కడైనా వాడుకోవచ్చు అని ప్రభుత్వం వెల్లడించింది.)

ఎ) 312, 499 బి) 412, 399
సి) 512, 299 డి) 612, 199

ఐసీసీ క్రికెట్ మహిళల ప్రపంచకప్ - 2017

క్రికెట్ మహిళల ప్రపంచకప్ - 2017 విజేతగా ఇంగ్లండ్ నిలిచింది. 2017 జులై 23 న లండన్‌లోని లార్డ్స్ మైదానంలో జరిగిన ఫైనల్లో 9 పరుగుల తేడాతో భారత్‌పై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ జట్టు 7 వికెట్ల నష్టానికి 228 పరుగులు చేసింది. భారత్ 48.4 ఓవర్లలో 219 పరుగులకు ఆలౌటయ్యింది.

- ఇంగ్లండ్ క్రీడాకారిణి ష్రబ్‌సోల్‌కు ఫైనల్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. ఈమె ఫైనల్లో 6 వికెట్లు తీసి 46 పరుగులు ఇచ్చింది. బీమౌంట్ (ఇంగ్లండ్)కు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు లభించింది.
- ఇంగ్లండ్ ప్రపంచకప్ గెలవడం ఇది నాలుగోసారి. 1973, 1993, 2009 ల్లో ఆ జట్టు విజేతగా నిలిచింది.
- భారత మహిళల జట్టు వన్డే ప్రపంచకప్ ఫైనల్లో ఓడటం ఇది రెండోసారి. 2005 లో ఆస్ట్రేలియా చేతిలో పరాజయం పాలైంది.
- తాజా టోర్నీలో అత్యధిక పరుగులు (410) సాధించిన ఘనత బీమౌంట్ (ఇంగ్లండ్) దక్కించుకుంది. 409 పరుగులు చేసిన భారత కెప్టెన్ మిథాలీరాజ్ రెండో స్థానంలో నిలిచింది.
- అత్యధిక వికెట్లు (15) తీసిన బౌలర్‌గా దక్షిణాఫ్రికాకు చెందిన వాన్ నీకెర్క్ నిలిచింది.
- విజేతగా నిలిచిన ఇంగ్లండ్ జట్టుకు 6 లక్షల 60 వేల డాలర్లు, రన్నరప్ భారత జట్టుకు 3 లక్షల 30 వేల డాలర్లు ప్రైజ్ మనీ లభించింది. సెమీ ఫైనల్లో ఓడిన ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్లకు లక్షా 65 వేల డాలర్ల చొప్పున ప్రైజ్ మనీ లభించింది. సెమీ ఫైనల్లో భారత జట్టు ఆస్ట్రేలియాను ఓడించింది.
- విజేతగా నిలిచిన ఇంగ్లండ్ జట్టుకు హీథెర్ నైట్ కెప్టెన్‌గా వ్యవహరించారు.
- తదుపరి ప్రపంచకప్ 2021 లో న్యూజిలాండ్‌లో జరగనుంది.

కరెంట్ అఫైర్స్

12. వస్తు-సేవల పన్ను (జీఎస్‌టీ) ఇంటెలిజెన్స్ విభాగానికి డైరెక్టర్ జనరల్‌గా 2017 జులైలో ఎవరు నియమితులయ్యారు?

ఎ) దేవీప్రసాద్ దాస్ బి) సుబ్రతో బెనర్జీ
సి) భగవాన్ ముఖర్జీ డి) జాన్ జోసెఫ్

13. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురించి 'మేకింగ్ ఆఫ్ ఎ లెజెండ్' పుస్తకాన్ని ఇటీవల ఎవరు రచించారు? (పుస్తక రచయిత దేశంలో పారిశుద్ధ్యం కోసం కృషి చేస్తోన్న 'సులభ్ ఇంటర్నేషనల్' సంస్థ వ్యవస్థాపకుడు. ఈ పుస్తకాన్ని 2017 జులై 12 న ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్, భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్ షా దిల్లీలో ఆవిష్కరించారు.)

ఎ) బెజవాడ విల్సన్ బి) బిందేశ్వర్ పాఠక్
సి) రాజేంద్రసింగ్ డి) టి.ఎం. కృష్ణ

14. తెలంగాణ రాష్ట్ర నూతన అడ్వకేట్ జనరల్‌గా 2017 జులైలో ఎవరు నియమితులయ్యారు? (తెలంగాణ ఆవిర్భావం తర్వాత రాష్ట్ర మొట్టమొదటి అడ్వకేట్ జనరల్‌గా వ్యవహరించిన కె. రామకృష్ణారెడ్డి తన పదవికి రాజీనామా చేసిన నేపథ్యంలో ఈ నూతన నియామకం జరిగింది.)

ఎ) కె. ప్రతాప్‌రెడ్డి బి) ఎల్. మాధవరెడ్డి
సి) డి. ప్రకాష్‌రెడ్డి డి) జి.మోహన్‌రెడ్డి

15. ఫేస్‌బుక్ తాజాగా వెలువరించిన గణాంకాల ప్రకారం ఫేస్‌బుక్‌ను వినియోగిస్తున్న దేశాల్లో భారత్ అగ్రస్థానంలో నిలిచింది. 2017 జులై 13 నాటికి భారత్‌లో ఫేస్‌బుక్‌ను క్రియాశీలకంగా వినియోగిస్తున్నవారు ఎంతమంది ఉన్నారు? (రెండో స్థానంలో అమెరికా నిలిచింది. అమెరికాలో ఫేస్‌బుక్‌ను క్రియాశీలకంగా వినియోగిస్తున్నవారి సంఖ్య 24 కోట్లు.)

ఎ) 24.10 కోట్లు బి) 24.20 కోట్లు
సి) 24.30 కోట్లు డి) 24.40 కోట్లు

16. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) జట్లు చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్‌పై సుప్రీంకోర్టు విధించిన రెండేళ్ల నిషేధం ఏ రోజుతో పూర్తయ్యింది? (2013 నాటి స్పాట్ ఫిక్సింగ్ కుంభకోణానికి సంబంధించిన కేసులో ఈ రెండు జట్లపై రెండేళ్ల నిషేధం విధిస్తూ 2015 జులైలో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో గత రెండు సీజన్లకు వీటి స్థానంలో పుణె సూపర్ జెయింట్స్, గుజరాత్ లయన్స్ ఐపీఎల్‌లోకి వచ్చాయి. వచ్చే సీజన్‌లో మళ్లీ చెన్నై, రాజస్థాన్ జట్లు లీగ్‌లో పాల్గొననున్నాయి.)

ఎ) జులై 12 బి) జులై 14
సి) జులై 16 డి) జులై 18

జవాబులు

1–డి	5–సి	9–ఎ	13–బి
2–డి	6–డి	10–బి	14–సి
3–ఎ	7–సి	11–సి	15–ఎ
4–బి	8–బి	12–డి	16–బి.

రచయిత
- సీహెచ్. కృష్ణప్రసాద్
విషయ నిపుణులు

కొత్త రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

భారతదేశ 14 వ రాష్ట్రపతిగా 2017 జులై 25 న రామ్‌నాథ్ కోవింద్ ప్రమాణ స్వీకారం చేశారు. పార్లమెంట్ సెంట్రల్ హాల్లో జరిగిన కార్యక్రమంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జె.ఎస్. ఖేహర్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు.

- జులై 17 న దేశవ్యాప్తంగా రాష్ట్రపతి ఎన్నికల పోలింగ్ నిర్వహించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా లోక్‌సభ సెక్రెటరీ జనరల్ అనూప్ మిశ్రా వ్యవహరించారు.
- జులై 20 న ఓట్ల లెక్కింపు నిర్వహించారు. భాజపా నేత రామ్‌నాథ్ కోవింద్ (71) ఘన విజయం సాధించి భారతదేశ 14 వ రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. ఎలక్టోరల్ కాలేజీలో ఉన్న దేశ శాసనకర్తల ఓట్లలో కోవింద్ 65.65 శాతం సాధించారు.
- ప్రతిపక్ష కూటమి తరపున ఉమ్మడి అభ్యర్థిగా బరిలో దిగిన లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్ ఓటమి పాలయ్యారు. ఆమెకు 34.35 శాతం ఓట్లు దక్కాయి.
- రాష్ట్రపతిని ఎన్నుకునే ఎలక్టోరల్ కాలేజీలో మొత్తం ఓట్లు 4896. వీటిలో ఎంపీల ఓట్లు 776 కాగా ఎమ్మెల్యేల ఓట్లు 4120. రామ్‌నాథ్‌కు పోలైన ఓట్లు 2930. వీటి విలువ 7,02,044. మీరాకుమార్‌కు పోలైన ఓట్లు 1844 వీటి విలువ 3,67,314. గైర్హాజరైన, చెల్లని ఓట్లు 122. మొత్తం 31 రాష్ట్రాలకు 23 రాష్ట్రాల్లో రామ్‌నాథ్ కోవింద్ పూర్తిస్థాయి ఆధిక్యం ప్రదర్శించారు. ఎనిమిది రాష్ట్రాల్లో మీరాకుమార్ పైచేయి సాధించారు.
- పార్లమెంట్‌లో మొత్తం 768 మంది ఎంపీలు ఓటు వేశారు. ఇందులో 21 మంది ఎంపీల ఓట్లు చెల్లలేదు. కోవింద్‌కు 522 మంది ఎంపీలు, మీరాకుమార్‌కు 225 మంది ఎంపీలు ఓటు వేశారు.
- ఆంధ్రప్రదేశ్ శాసనసభలో మొత్తం 175 స్థానాలు ఉండగా భూమా నాగిరెడ్డి మృతితో నంద్యాల స్థానం ఖాళీ అయ్యింది. మిగతా 174 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. రాష్ట్ర శాసనసభలోని మూడు పార్టీలూ (తెదేపా, వైకాపా, భాజపా) రామ్‌నాథ్‌కు మద్దతు పలికాయి. 174 ఓట్లలో మూడు ఓట్లు చెల్లలేదు.
- తెలంగాణలో మొత్తం 119 మంది శాసనసభ్యుల్లో 117 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ అనారోగ్యం కారణంగా ఓటింగ్‌కు హాజరుకాలేదు. తెలంగాణలో రామ్‌నాథ్‌కు పోలైన ఓట్లు 97, మీరాకు పోలైనవి 20.
- కోవింద్ ఉత్తర్ ప్రదేశ్‌లోని పారాంఖ్ గ్రామంలో 1945 అక్టోబరు 1 న జన్మించారు. కాన్పూర్ వర్సిటీ నుంచి బీకాం, ఎల్ఎల్‌బీ పట్టాలు పొందారు. 1971 లో న్యాయవాదిగా స్థిరపడ్డారు. 1994 నుంచి 2006 వరకూ రెండు పర్యాయాలు భాజపా తరపున రాజ్యసభకు ఎన్నికయ్యారు. 2015 ఆగస్టు 16 నుంచి 2017 జూన్ 20 వరకు బిహార్ 35 వ గవర్నర్‌గా వ్యవహరించారు.

ప్రతిభ పేజీలపై మీ సూచనలు పంపాల్సిన మెయిల్ ఐడీ
pratibhadesk@eenadu.net